క్లుప్తంగా

గూడెంలో కార్తిక రద్దీ



సత్యదేవున్ని దర్శించుకుంటున్న భక్తులు

దండేపల్లి: జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయంలో కార్తిక శనివారం సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. అధిక సంఖ్యలో తరలివచ్చి సత్యదేవున్ని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. ధ్వజస్తంభం, రావిచెట్టు వద్ద, ప్రధాన ఆలయ సమీపంలో భక్తులు దీపాలు వెలిగించారు. ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

మార్కెట్‌లో ఇబ్బంది లేకుండా చూడాలి



వ్యాపారులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని మార్కెట్ ఏరియాలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ ఏరియాలో శనివారం సాయంత్రం ఆయన పర్యటించారు. వ్యాపారస్తులతో మాట్లాడిన అనంతరం, మున్సిపల్ అధికారులు చేపట్టాల్సిన పనులపై చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వార్డు కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'గెలిపిస్తే సీపీఎస్ రద్దుకు కృషి'

జన్నారం: వచ్చే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ రద్దు కోసం కృషి చేస్తానని కృష్ణారావు అన్నారు. మండలంలోని కవ్వాల్ గ్రామంలో శనివారం ఆయన ఆశ్రమ పాఠశాలతో పాటుగా వివిధ పాఠశాలల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో హెచ్ఎం రమేశ్ చందర్, ఉపాధ్యాయులు శ్రీకాంత్, కాంతరావు తదితరులు పాల్గొన్నారు.

'అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం'

కోటపల్లి: నల్లగొండ మూసీనది పునరుజ్జీవ సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి మాట్లాడిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారిశెట్టి విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్లు ప్రజలకు సమ్మతమైన పరిపాలన అందించిన కేసీఆర్‌పై చౌకబారు మాటలు ఆపి, ఆరు గ్యారెంటీల అమలుపై దృష్టి పెట్టాలన్నారు. పది నెలల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మూటకట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు చేయాలని తెలిపారు. మరొకసారి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు.

హద్దుదాటి విద్యుత్ స్తంభం వేయొద్దు..!

మందమర్రిరూరల్: మందమర్రి మార్కెట్ ఏరియాలో ఓ దుకాణదారు షాపు ఎదుట గతంలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని హద్దు దాటి వేయడానికి సిద్ధపడ్డట్లు పలువురు టీపీవో తిరుపతమ్మకు శనివారం ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె అక్కడికి వెళ్లి పనులను నిలిపివేశారు. మున్సిపాలిటీ హద్దు దాటి ఉన్నటువంటి నిర్మాణాలను తొలగించడానికి సిద్ధమవుతుంటే, హద్దు దాటి కొత్తగా విద్యుత్ స్తంభం వేయడం ఏమిటని ప్రశ్నించారు. హద్దుదాటి వేయొద్దని సూచించారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ ఇంజినీర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఆ షాపు నిర్వాహకులు స్తంభం షిఫ్టింగ్ కోసం దరఖాస్తు చేసుకుని రుసుం చెల్లించినట్లు తెలిపారు.

'అమరుల ఆశయాల కోసం మరిన్ని పోరాటాలు'



నివాళులర్పిస్తున్న నాయకులు

జన్నారం: అమరుల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, ఆశయాలు నెరవేర్చడానికి మరిన్ని పోరాటాలు చేస్తామని సీపీఐఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి జాడి దేవరాజు పేర్కొన్నారు. మండలంలోని చింతగూడలో శనివారం మండల కార్యదర్శి ఆధ్వర్యంలో పేదల భూమి కోసం, భుక్తి కోసం పోరాటం చేసి, అమరులైన అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పురశెట్టి బాపు, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి రమ, నాయకులు మల్లేశ్, రజిత, పోశవ్వ, ఏసు పాల్గొన్నారు.

సర్వేకు సహకరించాలి



దండేపల్లి: సర్వేతీరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్



చెల్లాయిపేటలో సర్వే పరిశీలిస్తున్న డీపీవో



భీమారంలో సర్వే చేస్తున్న అధికారులు

- కలెక్టర్ కుమార్‌దీపక్, అదనపు కలెక్టర్ మోతీలాల్
- తప్పులు దొర్లకుండా చూడాలని అధికారులు, సిబ్బందికి సూచన

శ్రీరాంపూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటా సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సర్వేకు ఇంటికి వచ్చే అధికారులకు ఇంటి యజమానులు సహకరించాలని, వారు అడిగే ప్రశ్నలకు వివరాలను తెలియజేయాలన్నారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంపూర్ ఏరియా పలు వార్డుల్లో శనివారం సర్వే ప్రారంభించగా సర్వే తీరును కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. సిబ్బంది ఎలా నమోదు చేస్తున్నారో తెలుసుకున్నారు. అందులో పొందుపర్చిన అంశాలను ప్రజలకు విషదీకరించి వివరాలు నమోదు చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీశ్, వార్డు కౌన్సిలర్లు మేకల దాసు, పూదరి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

దండేపల్లి: సమగ్ర కుటుంబ సర్వేలో తప్పులు దొర్లకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) మోతీలాల్ సూచించారు. మండలంలోని నెల్కివెంకటాపూర్‌లో సమగ్ర సర్వేను శనివారం పరిశీలించారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి, సర్వే సమయంలో అడిగే ప్రశ్నల విధానం, ప్రజలు చెబుతున్న సమాధానాలను, సర్వే ఫాంలో నింపే తీరును పరిశీలించారు. ఒక్కో ఇంటికి ఎంత సమయం పడుతోందని గమనించారు. అనంతరం సర్వేపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, డీటీ విజయ ఉన్నారు. అనంతరం ఓటరు నమోదును పరిశీలించారు.

లక్సెట్టిపేట: సర్వేలో అన్ని వివరాలు సేకరించి పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులో సర్వే తీరును పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, మేనేజర్ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి, చెల్లాయిపేటలో నిర్వహించే సమగ్ర కుటుంబ సర్వేను జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్‌రావు తనిఖీ చేశారు. సర్వే ఎలా కొనసాగుతుందని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్‌అలీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నస్పూర్: పట్టణ పరిధిలోని 25వార్డుల్లో మొత్తం 20,594ఇళ్లను గుర్తించి 140మంది ఎన్యుమరేటర్స్‌తో సర్వే చేయిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ తెలిపారు.

కోటపల్లి: మండలంలోని నక్కలపల్లి, పంగిడి సోమారం, మల్లంపేట, సర్వాయిపేట గ్రామాల్లో సర్వే తీరును ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు అజయ్, కార్యదర్శి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జన్నారం: ప్రభుత్వం పతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇంటింట సమగ్ర సర్వే మండలంలో కొనసాగుతుంది. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింట సర్వే నిర్వహించారు. సర్వే ఫారంలో ఉన్న అన్ని ప్రశ్నలను అడిగి వివరాలను నమోదు చేసుకున్నారు. అదే విధంగా జన్నారం మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సర్వే ను ఎంపీడీఓ శశికళ , పరిశీలించారు.

భీమారం: మండలంలోని 11గ్రామపంచాయతీల్లో సర్వే కొనసాగింది. మండల కేంద్రంలో సర్వేను పంచాయితీ అధికారి కృష్ణమూర్తి పర్యవేక్షించారు. సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు.

తాండూర్: మండలంలోని అచ్చులాపూర్ గ్రామ పంచాయతీలో సర్వే ప్రక్రియను మండల అధికారులు చేపట్టారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ఇంటింటికి వెళ్లి సమగ్ర వివరాలు సేకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఎస్ఎస్‌వో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మున్సిపాలిటి పరిధిలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, గ్రామాల్లో ఎంపీవో అక్తర్ సర్వే తీరును పరిశీలించారు.

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో శనివారం సర్వే ప్రారంభమైంది. 34వార్డుల్లో ఎంపిక చేసిన అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు అడిగి తెలుసుకుని నమోదు చేసుకున్నా రు. పదో వార్డులో నిర్వహించిన సర్వేలో ము న్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస రావు, చైర్‌పర్సన్ శ్వేత హాజరయ్యారు. వార్డుల్లో నిర్వహించిన సర్వేలో ఆయా వార్డుల మున్సిపల్ కౌన్సిలర్లు, సూపర్ వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు. సర్వే తీరును ఆర్డీవో పి.హరికృష్ణ పర్యవేక్షించారు.



కోటపల్లి: కొల్లూర్‌లో సర్వే చేస్తున్న అధికారులు



బెల్లంపల్లి: 16 వార్డులో సర్వేలో పాల్గొన్న అధికారులు



తాండూర్: వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

కార్తిక లక్ష దీపోత్సవం పనులు ప్రారంభం



పూజ చేస్తున్న అధికారులు, నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి కేంద్రంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ దంపతులు ఈ నెల 11న నిర్వహించే కార్తిక దీపోత్సవం పనులు శనివారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ఏఎంసీ క్రీడా మైదానంలో కార్తిక లక్ష దీపోత్సవం, లక్ష పుష్పార్చనను ఎమ్మెల్యే వినోద్‌-రమా దంపతులు నిర్వహించనున్నారు. అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న మహిళలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానుండగా, ప్రముఖ ప్రవచనకర్త బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రీ, ఇతర వేద పండితులు హాజరు కానున్నారు. కనుల పండువగా నిర్వహించే ఈ కార్యక్రమానికి ఇందుకు సంబంధించి ప్రభుత్వ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు శాస్త్రోత్తంగా పూజలు చేసి పనులు ప్రారంభించారు. బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, ఏసీపీ రవికుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు, కాంగ్రెస్ నాయకులు మునిమంద రమేశ్, దావ రమేశ్ తదితరులు పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు?



మందమర్రిరూరల్: మున్సిపాలిటీ ఆవరణలో మరుగుదొడ్లు నిర్మించి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదుటే జాతీయ రహదారిపై నూతనంగా బస్‌షెడ్ ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు కూడా మరుగుదొడ్లు సౌకర్యంగా ఉంటాయని భావించారు. వాటిని ప్రారంభించకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బంది తప్పడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, మున్సిపల్ కమిషనర్ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని పాత బస్టాండ్ ఆవరణలో మరుగుదొడ్లతో పాటు మార్కెట్ బస్టాండ్ ఆవరణలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్డిని వెంటనే ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు ఫోన్‌చేస్తే స్పందించ లేదు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మందమర్రిరూరల్: సైబర్ మోసగాళ్లు రోజుకో రకంగా మోసం చేయడానికి కొత్త లింక్‌లు తయారుచేసి వల పన్నుతున్నారని మందమర్రి ఎస్సై రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిర్రకుంటలో మాసినేని రాజేందర్ అనే వ్యక్తికి గత అక్టోబర్ 9న గుర్తు తెలియని మొబైల్ నంబర్ నుంచి లింక్ రావడంతో అనుకోకుండా లింక్ క్లిక్ చేయడంతో ఓపెన్ అయింది. వెంటనే మొబైల్ నియంత్రణ కోల్పోవడంతో అతడి బ్యాంకు అకౌంట్ నుంచి బ్యాలెన్స్ రూ.50వేలు పోయినట్టు మెసేజ్ వచ్చిందని తెలిపారు. ఈ మేరకు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నపట్టు ఎస్సై తెలిపారు. మొబైల్ వినియోగదారులు సైబర్ మోసగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

11న అంప్రెంటిషిప్ మేళా

మందమర్రిరూరల్: ఈ నెల 11న మండల కేంద్రంలోని పాలచెట్టు సమీపంలో గల ప్రభుత్వ ఐటీఐలో పీఎం నేషనల్ అంప్రెంటిషిప్ మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ దేవానంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, డీజిల్ మెకానిక్ చదివిన విద్యార్థులు అంప్రెటిషిప్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రేపు ఉదయం 11గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

నేడు పత్తిమిల్లు ప్రారంభం

లక్సెట్టిపేట: మండలంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం పరిధిలోని వెంకటేశ్వర పత్తిమిల్లును ఆదివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పత్తిని దళారులకు అమ్మకుండా పత్తి మిల్లుకు తీసుకురావాలని, తేమశాతం లేకుండా ప్రభుత్వం కేటాయించిన ధరకు అమ్ముకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గద్దెరాగిడి, క్యాతనపల్లి ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ ప్రభాకర్ తెలిపారు. ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణపు పనుల్లో భాగంగా ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించాలని కోరారు.

సమాచారం

అమెరికా యూనివర్సిటీకి జెండా వెంకటాపూర్ విద్యార్థి ఎంపిక

నెన్నెల: మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన గోగు మనోహర్‌-పద్మ దంపతుల కుమారుడు గోగు మనోజ్ గ్రాడ్యుయేట్ రికార్డు ఎగ్జామినేషన్ (జీఆర్ఈ), ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్టింగ్ సిస్టమ్ (ఐఎల్ఈటీఎస్)లో ఉత్తమ ప్రతిభ కనబర్చి అమెరికాలోని జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీలో ఇంజనీర్ మేనేజ్‌మెంట్ ఎంఎస్ కోర్సుకు ఎంపికయ్యారు. మనోజ్ జీఆర్ఈలో 340మార్కులకు గాను 318మార్కులు సాధించి వాషింగ్టన్ యూనివర్సిటీ వారు అందించే ఎస్ఈఏఎస్ అవార్డుకు ఎంపికయ్యారు. మైక్రోసాఫ్ట్ కంపెనీలో స్టూడెంట్ అంబాసిడర్ ప్రోగ్రాంకు దక్షిణ భారతదేశం నుంచి ఎంపికైన ఏకైక విద్యార్థి మనోజ్ కావడం విశేషం. మనోజ్ హైదరాబాద్‌లోని శ్రీనిధి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పూర్తి చేశాడు. అమెరికా యూనివర్సిటీకి ఎంపికైన మనోజ్‌ను గ్రామస్తులు, బంధువులు అభినందించారు.

జాతీయ స్థాయి పోటీలకు...

తాండూర్: మండల కేంద్రం సుభద్ర కాలనీకి చెందిన ఇంటర్మీడియెట్ విద్యార్థినీ ఎండీ.సనా అంజుమ్ జాతీయస్థాయి సాఫ్ట్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికై ంది. ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సనా అంజుమ్ ఈ నెల 6న బెల్లంపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్ బేస్‌బాల్ పోటీల్లో అండర్‌-17 విభాగంలో పాల్గొని ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించింది. ఈ నెల 15న రాజస్థాన్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొననుందని విద్యార్థిని తల్లిదండ్రులు తెలిపారు. గత అక్టోబర్ 13న హర్యానాలో జరిగిన సాఫ్ట్‌బేస్ బాల్ అండర్‌-14 విభాగంలో పాల్గొని సనా అంజుమ్ ప్రతిభ చాటడం గమనార్హం. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన సదరు బాలికను తల్లిదండ్రులు, పలువురు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు...

రామకృష్ణాపూర్: జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో పట్టణానికి చెందిన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రేమారాణి తెలిపారు. జానపద పాటల పోటీ, గ్రూప్ డాన్స్, కవితల విభాగంలో పాఠశాల విద్యార్థినులు ప్రథమ బహుమతి సాధించారని పేర్కొన్నారు. కాగా ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను శనివారం ప్రత్యేకంగా అభినందించారు.

నియామకం

మంచిర్యాలటౌన్: తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మంచిర్యాలకు చెందిన బి.నారాయణరావు ను నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలోనే జిల్లా కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతీ కళాశాలలో ఒక సైకాలజిస్టు ఏర్పాటుకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

జన్నారం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలల మహాపాదయాత్రకు సంబంధించిన పోస్టర్లను శనివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. అక్టోబర్ 25 నుంచి ప్రారంభించిన ఈ యాత్ర డిసెంబర్ 1 వరకు కొనసాగుతుందని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గజ్జెల్ల లక్ష్మణ్ పేర్కొన్నారు.

నెరవేరనున్న ఆకాంక్ష..!

- భీమారంలో పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు ప్రారంభం
- అందుబాటులోకి రానున్న వైద్యసేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



పీహెచ్‌సీ భవన నిర్మాణం కోసం తవ్విన గుంతలు

భీమారం: జాతీయ రహదారికి పక్కనే ఉన్నా భీమారం మండల కేంద్రంలో పీహెచ్‌సీ లేకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడేవారు. దీంతో పక్క మండలమైన 30 కి.మీ దూరంలోని జైపూర్ పీహెచ్‌సీకి వెళ్లేవారు. ప్రస్తుతం మండల కేంద్రంలో పీహెచ్‌సీ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.47కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో పీహెచ్‌సీ కోసం ఎదురుచూస్తున్న ప్రజల కల నెరవేరబోతోంది. స్థల ఎంపిక విషయంలో కొంత అలస్యమైనప్పటికీ, రైతు వేదిక సమీపంలో ఎకరం స్థలం కేటాయించడంతో ఎట్టకేలకు పనులు ప్రారంభమయ్యాయి. ఆరునెలల వరకు భవనం పూర్తయ్యే అవకాశం ఉంది. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంబులెన్స్ ఏర్పాటు చేయాలి..

మండల కేంద్రంలో అంబులెన్స్ అందుబాటులో లేదు. చెన్నూర్ లేదా జైపూర్ అంబులెన్స్‌లు సేవలందిస్తుండగా అత్యవసర సమయాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటివరకు పీహెచ్‌సీ లేదనే ఉద్దేశంతో అంబులెన్స్ కేటాయించకపోగా, ఇప్పటికైనా అంబులెన్స్ సేవలు అందుబాటులోకి తేవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తొలగనున్న ఇబ్బందులు



ఇన్నాళ్లు పడ్డ కష్టాలు పీహెచ్‌సీ ఏర్పాటుతో తీరుతాయి. ఇప్పటివరకు కోతులు, కుక్కలు దాడి చేసి గాయపరిస్తే జైపూర్ ఆసుపత్రికి వెళ్లేవాళ్లం. మండల ప్రజల కష్టాలను గుర్తించి ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు మా కృతజ్ఞతలు.

– మెండె మల్లేశ్, భీమారం

మెరుగైన వైద్యం అందిస్తాం..



గ్రామాల్లోని పేద ప్రజలకు ప్రభుత్వ పరంగా అందించే సేవలను మరింత విస్తృత పరుస్తాం. భీమారం పీహెచ్‌సీ భవనం నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసి, మండల ప్రజల ఆకాంక్షను తీరుస్తాం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందిస్తాం.

– గడ్డం వివేక్ వెంకటస్వామి, చెన్నూర్ ఎమ్మెల్యే

ప్లాట్లు కొని పాట్లుపడొద్దు?

- ముందే హెచ్చరిస్తున్న అధికారులు



మేదరిపేటలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

దండేపల్లి: అక్రమ వెంచర్లు, లేఅవుట్లలో ప్లాట్లు కొంటే పాట్లు తప్పవు అనేలా అధికారులు ప్రజలను ముందే హెచ్చరిస్తున్నారు. మండలంలోని మేదరిపేట సమీపంలో పంచాయతీ అధికారులు ఇటీవల రోడ్ల వెంట పలు హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కొందరు వ్యవసాయ భూములను ఇళ్ల స్థలాలుగా విక్రయిస్తున్నారు. నాలా కన్వర్షన్ చేయకుండా విక్రయించడంతో కొనుగోలు చేసినవారు ఇళ్లు నిర్మించుకోవాలంటే పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదు. వ్యవసాయ భూమిని ఇంటి నిర్మాణ కోసం కొనుగోలు చేసినవారు మళ్లీ నాలా కన్వర్షన్ కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. నాలా కన్వర్షన్ చేసుకుని జీపీలో అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. దీంతో చాలామంది తెలియకుండానే వ్యవసాయ భూములను ఇళ్లస్థలాల కింద కొనుగోలు చేసి అనుమతుల కోసం పాట్లు పడుతున్నారు. అక్రమ వెంచర్లలో ఇళ్లస్థలాలు కొని ఇబ్బందులు పడొద్దని అధికారులు ముందుగానే హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

బొగ్గుబాయి వార్తలు

గైర్హాజరు లేకుండా పని చేయాలి



బహుమతి ప్రదానం చేస్తున్న ఏజెంట్ శ్రీధర్

శ్రీరాంపూర్: గైర్హాజరు లేకుండా పనిచేయాలని ఆర్కే 5 గ్రూప్ ఏజెంట్ శ్రీధర్ తెలిపారు. గనిపై శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉత్పత్తి లక్ష్యాల సాధనలో గని కొంత వెనుకబడిందన్నారు. గైర్హాజరు వల్ల అనుకున్న లక్ష్యాలు సాధించకలేకపోతున్నామన్నారు. ఉద్యోగులు సంస్థ లక్ష్యాల కోసం పని చేయాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి మాత్రమే సంస్థకు క్షేమమన్నారు. ఉత్పత్తితో పాటు ఉత్పాదకత పెంచితే మంచి ఇన్సెంటివ్ వస్తుందన్నారు. అధిక ఉత్పత్తికి కృషి చేసిన బీ రిలే కార్మికులను అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. గని నూతన మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన సుధీర్‌కుమార్‌ను ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి రాందాస్, సంక్షేమ అధికారి రణదీప్‌గౌడ్, ఇంజనీర్ సారయ్య, అడిషనల్ మేనేజర్ శివయ్యతో పాటు అధికారులు వేణుగోపాల్, సునీల్, నవీన్, లింకన్, ప్రశాంత్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ నర్సింగరావు పాల్గొన్నారు.

నేడు అమరవీరుల సంస్మరణ సభ

శ్రీరాంపూర్: విప్లవోద్యమంలో నేలరాలిన విప్లవకారుల సంస్మరణ సభను ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మానందం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాలలోని మార్క్స్ భవన్‌లో ఈ సభ ఉంటుందన్నారు. విప్లవ రథసారథులు తరిమెల్ల నాగిరెడ్డి, చంద్రా పుల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు, చారు మజుందర్, రాంనర్సయ్య, తదితరులు భూమికో సం, భుక్తికోసం ఆదివాసుల హక్కుల కోసం పోరాడి తమ ప్రాణాలు అర్పించారన్నారు. వారి సంస్మరణ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

'సింగరేణి యువతకు అండగా ఉంటా'

శ్రీరాంపూర్: సింగరేణి యువతకు అండగా ఉంటానని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేయనున్న నరేందర్‌రెడ్డి తెలిపారు. నస్పూర్‌-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో, ఆర్కే 7, శ్రీరాంపూర్ ఓపెన్ కాస్టు గనుల్లో కార్మికులను కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెత్తుల రాజేంద్రపాణి, కోశాధికారి శ్యాంసుందర్‌రెడ్డి, ఏరియా వర్కింగ్ ప్రెసిడెంట్ రేగళ్ల ఉపేందర్, జాయింట్ సెక్రెటరీ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

కుక్కలకు రక్షణేది....?



కుక్కలకు కుని ఆపరేషన్ చేసి ఉంచే షెడ్డు ఇదే

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఆండాళమ్మ కాలనీలో రూ.35లక్షలతో నిర్మించిన ఎనిమల్ కేర్ సెంటర్‌లో కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేస్తున్నారు. ఆపరేషన్ అనంతరం ఆయా కుక్కలను వారం రోజుల పాటు షెడ్డులోనే ఉంచి, వాటి ఆరోగ్యం కుదుటపడే వరకు వాటికి ఆహారం అందించి సంరక్షిస్తున్నారు. ఇటీవల కు.ని.ఆపరేషన్లు చేసిన కుక్కలను షెడ్డులోనే సంరక్షించగా, అందులో 8 మృతి చెందడం, వాటిని కొద్ది రోజుల తరువాత ఖననం చేయడం చర్చనీయాంశంగా మారింది. కుక్కలను చంపకుండా, వాటికి సంతతి కలగకుండా ఆపరేషన్లు చేసి, సంరక్షించాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది. కానీ ఇటీవల 8 కుక్కలు మృతి చెందడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. లక్షల కొద్ది నిధులు ఖర్చు చేసి ఎనిమల్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తే, అధికారులు, నిర్వాహకుల నిర్లక్ష్యంతో, కుక్కలు మృత్యువాత పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల : 9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
చెన్నూర్ : సంపత్‌కుమార్ - 9949708989
టోల్ ఫ్రీ నం. : 1800 425 9899